

స్విమ్మింగ్ పోటీలకు పందలపాక విద్యార్థులు

ప్రజాశక్తి - బిక్కవోలు

పందలపాక శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కాకినాడ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-19 స్విమ్మింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో పాఠశాలకు చెందిన సిహెచ్.కార్తీక్‌సూర్య, ఎల్.సతీష్, గుత్తుల దినేష్ వర్ధన్‌కుమార్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించిన పాఠశాల వ్యాయామ దర్శకులు ద్వారంపూడి యువరాజారెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. ఎంపికైన క్రీడాకారులను అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయ ప్రతినిధి కర్రి వీరిరెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పంపన వీర సత్యనారాయణ, జక్క వీరభద్రం తదితరులు అభినందించారు.

కూటమిలో కుంపటి

- నాయకుల మధ్య కుదరని సఖ్యత
- కొలిక్కిరాని జనసేన నాయకునిపై దాడి వ్యవహారం
- టిడిపి కార్యాలయానికి దూరంగా జన సైనికులు



ప్రజాశక్తి -కొవ్వూరు

ఇటీవల జనసేన నాయకునిపై టిడిపి కార్యాలయంలో దాడి వ్యవహారం కూటమిలో విభేదాలను మరోమారు బహిర్గతం చేసింది. ఇరు పార్టీ నేతల మధ్య సఖ్యత కుదుర్చేందుకు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొలిక్కిరాలేదు. దాడి వ్యవహారాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ ఇంత వరకూ స్పందన కనిపించకపోవడంతో ఎఎంసి డైరెక్టర్ గంగుమళ్ల స్వామి, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి మైగాపుల బాలకృష్ణ సోమవారం నుంచి నిరాహార దీక్షకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన సర్ది చెప్పడంతో తాత్కాలికంగా నిరాహార దీక్షను వాయిదా వేసుకున్నారు. దాడిలో దెబ్బలు తిన్న ఇరువురు జనసేన పార్టీ నాయకులకు ఆ పార్టీలో మెజారిటీ నాయకులు మద్దతు పలికారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర సైతం వారిని పరామర్శించి సంఘీ భావాన్ని ప్రకటించారు. జనసేన పార్టీలో కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకులే అధికంగా ఉండడం, దాడిలో దెబ్బలు తిన్న ఇరువురు అదే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఈ ఘటనను జనసేన పార్టీ నాయకులు సీరియస్‌గా తీసుకున్నారు.

ఇన్చార్జి నియామకం ఎప్పుడు?

రెండు నెలల క్రితం సొసైటీ అధ్యక్షుల నియామకంలో జనసేన పార్టీకి తగిన ప్రాధాన్యం ఇవ్వ లేదని రోడ్డెక్కిన ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి టివి.రామారావును బాధ్యతల నుంచి తప్పించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలలో పాల్గొన రాదని అధిష్టానం ఆదేశించింది. అనంతరం పార్టీ పరిణామాలపై అధిష్టానం పెద్దలు వచ్చి రామారావు, ఇతర నాయకులతో సంప్రదింపులు జరిపారు. కాని నేటికీ దీనిపై ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. ఇటీవల జనసేన పార్టీ సీనియర్ నేత, డిసిసిబి మాజీ అధ్యక్షుడు కరాటం రాంబాబు టివి.రామారావు పుట్టినరోజు వేడుకకు హాజరయ్యారు. టిడిపి నేత, పారిశ్రామికవేత్త అల్లూరి విక్రమాదిత్య సైతం ఈ వేడుకల్లో పాల్గొనడం చర్చనీయాంశమైంది. దీంతో ఇన్‌ఛార్జి నియామకం వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. రామారావుకు వ్యతిరేకంగా టిడిపి నేతలు పావులు కదుపుతున్నట్టు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇసుక ర్యాంపుల కేటాయింపుల విషయంలోనూ రామారావు గట్టిగానే గళం విప్పారు. ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ఇసుకను టిడిపి నేతలు అధీనంలో ఉంచుకున్నారు. దీనికి రామారావు తరచూ అడ్డు తగలడంతో టిడిపి నేతలు ఆయనపై గుర్రుగా ఉన్నారనే ప్రచారం సాగుతుంది.

జనసేన పార్టీలో తలోదారి :

జనసేన పార్టీలో నాయకులు తలోదారిగా వ్యవహరిస్తున్నారు. కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్న గ్రామాల్లో ఆ పార్టీ పట్టు సాధించింది. సీతంపేట, కాపవరం, మద్దూరు తాడిపూడి, రావూరుపాడు, పెనకనమెట్ట వంటి గ్రామాల్లో జనసేన బలంగా ఉంది. ఈ గ్రామాల్లో ఎంపిటిసి, సర్పంచ్ పదవులను సైతం ఆపార్టీ కైవసం చేసుకుంది. ఐ.పంగిడి, వేగేశ్వరపురం, పెద్దేవం ఒంటి గ్రామాల్లోనూ జనసేన పుంజుకుంది. నియోజక వర్గంలో 40 పంచాయితీలుంటే వాటిలో 10 గ్రామాల్లో జనసేన పార్టీ ఇతర పార్టీలతో దీటుగా ఎదిగింది. మాజీ ఎంపిపి పికె.రంగారావు వంటి నాయకులు కూటమి ప్రభుత్వంలో చేస్తున్న పనులను, ఇతర వ్యవహారాలను బాహాటంగానే తప్పుపడుతున్నారు. తాళ్లపూడి, చాగల్లు మండల పార్టీ అధ్యక్షులుచ ఇన్నాళ్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న టివి.రామారావు నాయకత్వానికి దూరంగా ఉన్నారు. అధిష్టానం నియోజకవర్గంలో నాయకులందరినీ సమన్వయపరిచే బాధ్యత తీసుకోకపోవడంతో వారంతవారంత తలోదారిలా వ్యవహరిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని అంటిపెట్టుకున్న కొందరు నాయకులను అధిష్టానం గుర్తించకపోవడంతో అంతర్గతంగా అసంతృప్తి ఉంది.

స్థానిక ఎన్నికల నాటికైనా సఖ్యత కుదిరేనా....?

మరో ఆరు నెలల్లో స్థానిక ఎన్నికల సమరం ప్రారంభం కానుంది. ప్రస్తుతం టిడిపి, జనసేన నాయకుల మధ్య వైరం నియోజకవర్గంలో తారా స్థాయికి చేరింది. ఇటీవల చోటు చేసుకున్న వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఆ పార్టీ నాయకులు టిడిపి కార్యాలయానికి వెళ్లడం లేదు. కూటమి నాయకుల మధ్య సఖ్యత లేకపోతే రానున్న స్థానిక ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు పెద్ద సమస్యగా మారే అవకాశం ఉంది. రానున్న ఎన్నికల్లో 10 పంచాయతీలకు పైగా జనసేన పార్టీ కోరే అవకాశం ఉంటుంది. ఇప్పటికే మూడు స్థానాలు గెలుపొందినందున రానున్న మండల పరిషత్ ఎన్నికల్లోనూ పది స్థానాల వరకు జనసేన పోటీ చేసే అవకాశం మెండుగా ఉంది. దీనికి టిడిపి నేతలు ఏ మేరకు సహకరి స్తారనేది ఆసక్తికరంగా మారింది. ఐ.పంగిడి, వేగేశ్వరపురం, పెద్దేవం, తాళ్లపూడి, అన్నదేవరపేట, మద్దూరు లంక, సీతంపేట, మద్దూరు కాపవరం, వెనకనమెట్ట వంటి గ్రామాల్లో ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలకు జనసేన పార్టీ పోటీపడే అవకాశం ఉంది. కొవ్వూరు పురపాలక సంఘంలోనూ 2, 8, 12, 23 వార్డుల్లోనూ జనసేన ప్రభావం ఉంటుంది. గత మున్సిపల్ ఎన్నికల్లో 10 వార్డుల్లో జనసేన పోటీ చేసింది. మరోపక్క బిజెపి కూడా రేసులో నిలబడే అవకాశం కనిపిస్తుంది. కొవ్వూరు పురపాలక సంఘంలో బిజెపి గత ఎన్నికల్లో 9వ వార్డు నుంచి గెలుపొందగా, 11వ వార్డులో 400కు పైగా ఓట్లను రాబట్టింది. దీంతో ఈసారి బిజెపి సైతం రెండు మూడు వార్డులను కోరే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కొవ్వూరు పట్టణానికి చెందిన వారే కావడంతో రానున్న స్థానిక ఎన్నికల్లో కొన్ని సీట్లు కోరే అవకాశం ఉంది. స్థానిక సమరానికి ముందే కూటమి నాయకుల మధ్య ఏర్పడిన విభేదాలు ఎటువంటి పరిణామాలుకు దారితీస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.



ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రాణిసుస్మిత

జిల్లాలో భారీ వర్షం

ఇళ్లల్లోకి ప్రవేశించిన వర్షపు నీరు
నీట మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి- నల్లజర్ల, గోపాలపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తూర్పు గోదావరి జిల్లాలో సోమవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. నల్లజర్ల మండలం అయ్యవరంలో కురిసిన భారీ వర్షానికి ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. గ్రామంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పొంగడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి లోతట్టు ప్రాంతంలోని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. భారీ వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి తలెత్తుతుందని బాధితులు వాపోతున్నారు. తమను ఆదుకోవాలని బత్తిన సురేష్. వల్లిబోయిన గోపి.



వల్లి బోయిన ఆదినారాయణ, టెంకాల రాము కోరుతున్నారు. ప్రస్తుతం నీట మునిగిన కుటుంబాలను నల్లజర్ల సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు గుడిసె శివకష్ణ, కొండబాబు, సర్పంచ్ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శి పరామర్శించారు. వారికి గ్రామంలో పునరావాసం కల్పించారు. .

గోపాలపురంలో కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు ముంపునకు గురయ్యాయి. మండలంలో పలుగ్రామాల్లో వేయి ఎకరాల వరి పంట ముంపునకు గురైనట్టు ఎఒ కూచిపూడి ఏసుబాబు తెలిపారు. చిట్యాల నుంచి పంగిడి వైపు వెళ్లే కొవ్వాడ కాలువ ఉధృతంతా ప్రవహిస్తుంది. దీంతో చిట్యాలలో 600, వెంకటాయపాలెంలో 364 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. అలాగే భీమోలులో 70, గుడ్డిగూడెం 34 ఎకరాల్లో పంట మునిగిపోయింది. ఈ ఏడాది కొవ్వాడ కాలువ పూడికలు తీసినప్పటికీ వేయి ఎకరాలకు పైగా వరి పంట పొలాలు మునగడంతో రైతన్నలు తీవ్ర ఆందోళన గురవుతున్నారు. ఇప్పటికే పంట వేసి 60 రోజులకు పైగా కావొస్తుంది. ఈ సమయంలో పంట మునగడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

పంట పొలాలను పరిశీలించిన కొవ్వూరు ఆర్‌డిఒ

కొవ్వాడ కాలువ ఉధృతికి చిట్యాలలో ముంపునకు గురైన పంట పొలాలను కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ముంపుపై వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట కొవ్వూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు చింతల శ్రీనివాస్, తహశీల్దార్ ఎంవి.సాయిప్రసాద్, వివిధ శాఖల సిబ్బంది, రైతులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి

ప్రజాశక్తి-నల్లజర్ల.

విద్యారంఘం సమస్యలపై యుటిఎఫ్ తలపెట్టిన రణభేరి జాతాను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ముద్రించిన రణభేరి పోస్టర్‌ను నల్లజర్ల ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. 17న జిల్లాలో గోకవరంలో ప్రవేశించే ప్రచార జాతాకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని జిల్లా కార్యదర్శి సిహెచ్ఎస్ఎస్.మనోహర్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి. బి కిషోర్, మండల కార్యదర్శి టి.నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

దళిత రణభేరికి తరలిరావాలి

ప్రజాశక్తి - పెరవలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 24న విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టే దళిత రణభేరి ధర్నాకు తరలి రావాలని కోరుతూ బిఎస్‌పి నాయకులు పిలుపునిచాచరు. పెరవలి బిఎస్‌పి కార్యాలయం వద్ద సోమవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి దళితులపై దాడులు జరిగినప్పుడు పరామర్శలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు దళిత పేటల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవన్నారు. దళితులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తు న్నారన్నారు. దళితులు కూటమి పాలనలో దినదిన గండంగా బతకాల్సి వస్తుందన్నారు. దాడులు చేస్తుంటే బిఎస్‌పి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మాపు చిత్రసేను, ఏలూరి అశోక్‌కుమార్, సిర్రా రాజు, నల్లి రమేష్, చల్లాబత్తుల సత్యనారాయణ, బయ్యే మునీంద్ర, బద్దా జాన్, కప్పల ఇజ్రాయెల్, గొల్ల ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - రాజానగరం



అద్విక్-2025 ప్రారంభోత్సవంలో పాల్గొన్న విసి ప్రసన్నశ్రీ తదితరులు

విద్యార్థులు నన్నయ జ్ఞానం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య శ్రద్ధ రెండింటి నుంచి ప్రేరణ పొంది నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని విసి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్శిటీ ఇంజినీరింగ్ విభాగంలో అద్విక-25 ఫెస్ట్‌ను సోమవారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విసి ప్రసన్నశ్రీ, ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి నన్నయ విగ్రహానికి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో విసి మాట్లాడారు. భారతదేశ ఇంజినీరింగ్ నైపుణ్యానికి బంగారు ప్రమాణంగా విశ్వేశ్వరయ్య నిలిచాం˘న్నారు. ఇంజినీరింగ్ అంటే కేవలం సమీకరణలు, గణనల గురించి కాదని, దృష్టి, సమగ్రత మరియు పరివర్తన ప్రభావం గురించి అనే ఆలోచనకు ఆయన జీవితం ఒక నిదర్శనం అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ప్రతి ఏడాది అద్విక పేరుతో ఇంజినీరింగ్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రేజెంటేషన్స్, టెక్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్పో, షర్ట్ ఫిల్మ్ మేకింగ్, స్కిల్ హౌస్ వంటి సాంకేతిక పోటీలను నిర్వహించామని తెలిపారు. అనంతరం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ బ్రోచర్‌ను విసి ఆవిష్కరించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా స్థానిక ఇంజినీర్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అద్విక టెక్ ఫెస్ట్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్లులను అందించారు. రూరల్ వాటర్ సప్లై విభాగం ఇఇ బి.వెంకటగిరి, డిప్యూటీ ఇఇ టి.శ్రీనివాసబాబు, ఎఇ వి.అవినాష్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.తిలక్‌కుమార్, ఎపి ట్రాన్స్ కో ఇఇ రవికుమార్, ఐసిఐ రాజమహేంద్రవరం సెంటర్ చీఫ్ కన్సల్టెంట్ చైర్మన్ డాక్టర్ కె.వి.నరసింహారావు, ఒఎన్‌జిసి విశ్రాంత ఇఇ జివివిఎస్.ప్రసాద్, ఇంజినీర్ డి.హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కడియం

నాబార్డు నిధులు రూ.2.60 కోట్లతో నిర్మించే కడియం-జేగురుపాడు కాలువ గట్టు బిటి రోడ్డు నిర్మాణ పనులకు రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మండలంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కడియం మండలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాతామన్నారు. సమగ్రంగా సర్వే జరిపి ఆక్రమణలకు గురైన పంట బోదేలను, మురుగునీటి కాలువలను పునరుద్ధరిస్తామని తెలిపారు. తద్వారా రోడ్ల మన్నిక పెరగడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఎపిఐసిసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, ఎంపిడిఒ కె.రమేష్ సర్పంచులు అన్నందేవుల చంటి, చెక్కపల్లి మురళి, కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరుగుతున్నప్పటికీ సర్పంచ్ మోసుగంటి సత్యవతి హాజరు కాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు ఆమె స్థానికంగా అందుబాటులో ఉన్నారా? లేదా? ఉన్నప్పటికీ ఆమెకు సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాన్ని నిర్వహించేశారా? అనే చర్చ జరుగుతుంది.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సచివాలయం 3లో ఠాన సెంటర్ వద్ద నున్న ప్రాథమిక పాఠశాలలో ఫైలేరియా నిర్మూలనలో భాగంగా విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జి.కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. 10 మందికి ఫైలేరియా టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. నిఖిత మాట్లాడుతూ ఫైలేరియా వ్యాప్తిని తెలుసుకునేందుకు రాజా ప్రైవేట్ స్కూల్లోనూ వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దివ్యనాగశ్రీ, వైద్య సిబ్బంది అరుణ, రమ్య, మోనిక, అనూష, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అఖిలాంధ్ర ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తరపున పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు చేకూరి కృష్ణప్రసాద్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయన్ని సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఇటువంటి ఉపాధ్యాయులు తమ పాఠశాలలో పనిచేయడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య విగ్రహం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలోని సర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్యనగర్ కాలనీలో విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణికి సోమవారం వినతిపత్రం అందంచారు. పట్టణంలో ఇది మొదట ఏర్పడిన కాలనీ అన్ని, ఆ సయమంలో ముఖ ద్వారంలో మోక్ష గుండం విశ్వేశ్వరయ్య నగర్ కాలనీతో పెద్ద ఆర్చి ఉండేదని కాలక్రమేణా అదృశ్యమైందన్నారు. దీన్ని పునరుద్ధరించాలని కోరారు. విగ్రహ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదిస్తే విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఇవ్వటానికి దాతలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రాజుకుంటున్న ఫ్లెక్సీల వివాదం

తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం

ప్రజాశక్తి - నిడదవోలు



తొలగించిన బూరుగుపల్లి ఫ్లెక్సీలతో టిడిపి నాయకులు


కూటమి పార్టీల మధ్య రోజురోజుకూ అంతరం పెరుగుతోంది. సోమవారం నిడదవోలు పట్టణంలో చోటు చేసుకున్న ఫ్లెక్సీల వివాదంతో ఇది మరోమారు రుజువైంది. నిడదవోలు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఫ్లెక్సీలను తొలగించి, ఆస్థానంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో టిడిపి పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆగ్రహించారు. పీకేసిన శేషారావు ఫ్లెక్సీలను చేతబట్టి, బ్రిడ్జిపై నిరసన తెలిపారు. మున్సిపల్ అధికారుల పక్షపాత ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ అత్యుత్సాహంతో మంత్రి పుట్టినరోజును పురస్కరించుకుని ఫ్లెక్సీలు స్వయంగా ఏర్పాటు చేయించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. శేషారావు ఫ్లెక్సీలను యధావిధిగా ఉంచి, మంత్రి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పినా వినలేదన్నారు.

120 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం ఆధ్వర్యంలో మైత్రేయ బుద్ధ విహార్ ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారని పీఠాధిపతి భంతే అనాలయో తెలిపారు. వేమగిరి, పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల సహకారంతో ప్రతి నెల మూడో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరం అయ్యాయని, అవసరమైన వారందరికీ మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా ఇంజినీర్స్ డే

ప్రజాశక్తి - తాళ్లపూడి

పైడిమెట్ట ఎంపిబిపి పాఠశాలలో సోమవారం ఇంజినీర్స్ డేను నిర్వహించారు. ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి హెచ్ఎం దున్నా దుర్గారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి మోక్షగుండం జీవితాన్ని ఆదర్శంగా తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయుడు ధర్మాన రాము, ఆయా చిట్టెమ్మ, మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు రామలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

పెరవలి : ఇంజినీర్స్ డే పురస్కరించుకుని ఎంపిడిఒ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఇంజినీర్లు ఎం.డేవిడ్‌నిశ్చల్; భగవాన్ నారాయణ, సతీష్, సాయి కుమార్, ఎ.శ్రీను, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాదిరెడ్డి బాబుజీరావు, ఎంపిపి కార్చెర్ల సీతారాం ప్రసాద్, ఎంపిడిఒ కెయుఆర్ఎల్.పద్మజ, తహశీల్దార్ కె.నిరంజన్, కోలా సీతయ్యానాయుడు పాల్గొన్నారు.

బలభద్రపురంలో కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - బిక్కవోలు

బలభద్రపురంలో బసవతారకం ఇండో - అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్'లను అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలబద్రపురంలో కేన్సర్ కేసులు ఎక్కువగా రావడంతో అసెంబ్లీలో ప్రస్తావించానన్నారు. మీడియాలో వచ్చిన వార్తలకు బాలకృష్ణ, నారా బ్రాహ్మణి స్పందించి బసవతారకం కేన్సర్ హాస్పిటల్ ద్వారా సాయం అందించారన్నారు. ప్రతి నెలా మూడేసి రోజులు చొప్పున మూడు నెలల పాటు ఇక్కడ క్యాంప్ ఏర్పాటు చేసి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి వైద్య సాయం అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఖరీదైన వ్యాక్సిన్‌ను ఉచితంగా వేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో సోమవారం 'స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' పోస్టర్లను డిఆర్ఒ టి.సీతారామ మూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. మహిళలకు అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ పరీక్షలు, క్షయ స్క్రీనింగ్, పోషణ అభియాన్, తల్లి- బిడ్డ సేవలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, వయో వృద్ధుల ఆరోగ్య సేవలు, మానసిక వైద్య సేవలు, అలాగే ఆయుష్ వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కార్యక్రమం విశాఖలో జరుగుతుందన్నారు. జిల్లాలో ధవళేశ్వరం పిహెచ్‌సిలో సెప్టెంబర్ 17 ఉదయం జరిగే ప్రారంభ కార్యక్రమానికి ఎంపీ పురంధరేశ్వరి, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ ఎల్.అప్పలకొండ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

గోకవరం : గోకవరం సామజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఈనెల17 నుంచి అక్టోబర్2 వరకు నిర్వహిస్తామని ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు.

రసాబాసగా తాళ్లపూడి మండల సమావేశం

ప్రజాశక్తి - తాళ్లపూడి

సోమవారం జరిగిన తాళ్లపూడి మండల సమావేశం రసాబసాగా మారింది. 15వ ఆర్థిక సంఘం నిధులు సర్పంచులు, ఎంపిటిసిలు ఖర్చు చేయడానికి వీలు లేదనే విషయంపై సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం ఇచ్చారు. దీనిపై ఎంఎల్ఎ వివరణ ఇచ్చే సమయంలో సమావేశానికి వచ్చిన కొందరు టిడిపి నాయకులు సభ్యులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మరింత ఆగ్రహానికి గురైన ప్రజాప్రతినిధులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఎంపిడిఒ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో చేసేది లేక ఎంఎల్ఎ కూడా వెనుదిరిగారు. అనంతరం ఎంపిపి, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అధికారులకు, శాసనసభ్యులకు ప్రజా సమస్యలు చెప్పుకునే హక్కు తమకు ఉందన్నారు. సభకు సంబంధం లేని టిడిపి నాయకులు సర్వసభ్య సమావేశానికి హాజరై తమపై దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండిస్తున్నామన్నారు.

నేరాలు ఘోరాలు

అనధికార బాణసంచా సీజ్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ గ్రామ శివారు హైవే రోడ్డు దగ్గరలో కొప్పుల సుధాకరెడ్డి రేకుల షెడ్డులో అనుమతి లేని బాణాసంచాను పోలీసులు సీజ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ జి.నరేష్ మీడియాకు వివరించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముందస్తు సమాచారం మేరకు జొన్నాడలో పిఎసిఎస్ బాణాసంచా నిల్వ చేసినట్లు తెలిసిందన్నారు. నిల్వ చేసిన ప్రాంతాన్ని గుర్తించి బాణాసంచాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బాణాసంచా విలువ రూ.2,07,165 ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సూర్యచంద్రం, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

పలు చోరీ కేసులో ముద్దాయికి ఆలమూరు జెఎఫ్‌సిఎం కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ జైలు శిక్ష విధించారు. ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... 2024 జూలై 23న మండలంలోని టేకి గ్రామంలో జరిగిన చోరీ ఘటనపై అప్పటి ఎస్ఐ పరశిక కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన నిందితుడు రేవు శ్రీనివాస్‌కు ఒక్కొక్క కేసులో మూడేళ్ల జైలు శిక్ష రూ.10 వేలు జరిమానాతో పాటు జరిమానా కట్టకపోతే అదనంగా 3 నెలల వరకు జైలు శిక్ష విధించినట్లు తీర్పు చెప్పారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విల్ల శ్రీరాములు ఫిర్యాదుదారుల తరపున వాదించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

మురారిలో గుర్తు తెలీని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. హైవే రోడ్డులో అంబేద్కర్ సెంటర్ వద్ద 65 ఏళ్ల మహిళ నడుచుకుని వెళుచుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆమెను గాయపడిన ఆమెను పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఆమె మృతి చెందినట్టు తెలిపారు.




నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎర్రవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. జెఎసి జగ్గంపేట అధ్యక్షుడు పి.శ్రీనివాసరాజు మాట్లాడారు. విద్యుత్ శాఖ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకం అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని. విద్యుత్ శాఖలో అన్ని విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని దశలవారీ ఉద్యమం నిర్వహిస్తామన్నారు. ఉద్యమంలో భాగంగా ఈ నెల 17, 18 తేదీల్లో కాకినాడ విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కె.అప్పారావు, బాబ్జి, క్యాలంగి సతీష్, శ్రీనివాస్ ఉన్నారు.



ఎంపిడిఒ శ్రీలలితను సన్మానిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఎంపిడిఒ శ్రీలలితకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎంపిడిఒ శ్రీలలిత విశాఖ జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారిగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన సందర్భంగా సోమవారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే సత్యవతి, డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నూనె మంగా లక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

ధాన్యం కొనుగోలు విషయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై సోమవారం సామర్లకోట మండల కార్యాలయంలో మండల పరిధిలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, విఎఎలు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ అధ్యక్షత వహించారు. సివిల్ సప్లయ్ ప్రతినిధి దుర్గాప్రసాద్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయాలన్నారు. వెహికల్ రిజిస్ట్రేషన్, కూపన్ జనరేషన్, జిఎల్‌టి, ట్రక్ షీట్ జనరేషన్, విఎ హెల్పర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మండల వ్యవసాయ అధికారి మురళీధర్, ఎఇఒలు శాంతి కమల, రూప, టెక్నికల్ అసిస్టెంట్లు దుర్గాప్రసాద్, శ్రావణి పాల్గొన్నారు.

రైల్వేలైన్ పూర్తి చేసేందుకు కృషి

ప్రజాశక్తి - అమలాపురం

కోనసీమ రైల్వేలైన్ పూర్తి చేయాలని కోరుతూ కోనసీమ రైల్వే సాధన సమితి స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎంపి హరీష్‌మాధుర్, ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. గత 25 ఏళ్లుగా కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ నత్తనడక నడుస్తుందన్నారు. కోనసీమ అభివృద్ధికోసం రైల్వేలైన్‌ను తొందరగా పూర్తి చేయాలని కోరారు. రెండేళ్ల కిందట అర్ధంతరంగా మూతపడిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను తిరిగి తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ, కోనసీమ రైల్వే



ఎంపి హరీష్‌ను పూలమాలతో సత్కరిస్తున్న బృందం

ప్రాజెక్ట్ కోసం తన తండ్రి బాలయోగి చాలా కృషి చేశారని, తన ప్రస్తుత పదవీ కాలంలోనే ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను తెరిచేలా తక్షణమే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ చుట్టుపక్కల జిల్లాలతో పోలిస్తే కోనసీమ బాగా వెనుక బడి ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి జిల్లా ప్రజాప్రతినిధులు అందరూ సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌ఎస్‌ఎస్ కన్వీనర్ డాక్టర్ ఇఆర్. సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణరావు, సభ్యులు కల్వకొలను తాతాజీ, బిఎస్.మూర్తి, పోలిశెట్టి శివాజీ, వంకాయల రాజా, ఉప్పుగంటి భాస్కరరావు, ఎర్రమిల్లి పాండురంగరావు, ఎరగర్త వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణి కీర్తి అమూల్యను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

కుడోలో మోడరన్ విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థి వి.కీర్తిఅమూల్య కుడో పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 14న వైజాగ్‌లో జరిగిన కుడో రాష్ట్ర స్థాయి పోటీలో ఆమె ఈ ఘనతను సాధించింది. అనకాపల్లి ఎంఎల్ఎ కొనతల రామకృష్ణ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌ను అందుకుంది. ఈ సందర్భంగా సోమవారం మోడరన్ కాలేజీలో జరిగిన అభినందన సభలో కీర్తి అమూల్యను మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు, ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా జివి.రావు మాట్లాడుతూ కీర్తి అమూల్య భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో ప్రతిభ చాటి ఉన్నత స్థానానికి చేరాలని ఆకాంక్షించారు. అక్టోబర్‌లో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో మెరుగ్గా రాణించడానికి కృషి చేస్తానని కీర్తి అమూల్య తెలిపారు.



మెడల్స్, సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

కరాటేలో 'సిద్ధార్థ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

ఇంటర్ స్టేట్ లెవెల్ కరాటే టోర్నమెంట్ పోటీలలో ఆలమూరులోని శ్రీసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ నెల14న అమలాపురం సమీపంలోని బిఆర్‌కె ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పోటీల్లో బాలికల జూనియర్స్ కత్తి మూమెంట్ ఎ విభాగంలో అనుశ్రీ కార్తీక, బాలుర ఫైటింగ్ ఇ విభాగంలో గెద్దాడ జాయ్‌కిరణ్, కటాస్ ఎ విభాగంలో డి.సాయిదత్త, కటాస్ బి విభాగంలో కె.సాకేత్ గోల్డ్ మెడల్స్ సాధించారు. ఫైటింగ్‌లో గుత్తుల షణ్ముఖ, కటాస్ ఎ విభాగంలో పాలూరి సాయిచరణ్‌సంతోష్‌కుమార్ సిల్వర్ మెడల్స్ సాధించగా, బి విభాగంలో సంగీత సత్యవెంకటఆదిత్య బ్రాంజ్ మెడల్‌తో విజేతగా నిలిచాడు. దీంతో విజేతలను సిద్ధార్థ సంస్థల అధినేత కె.ముల్లారావు, కోచ్ టి.వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.



విలేకరుల సమావేశంలో బిసి సంఘ నాయకులు

కులాల మధ్య చిచ్చురేపిన వైసిపి

ప్రజాశక్తి - ఆలమూరు

బిసి సర్టిఫికెట్లు జారీలో గత వైసిపి ప్రభుత్వం కులాల మధ్య చిచ్చురేపిందని బిసి సంఘ నేతలు విమర్శించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో బిసి సంఘ నేతలు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, ఈడిగ, యాత కులాలు గీత కులాలని, కులవృత్తి ఒకటేనని అన్నారు. అయితే గత వైసిపి పాలనలో బిసి సర్టిఫికెట్ల జారీలో చేసిన అవకతవకల వల్ల తమ కులాల మధ్య చిచ్చుగా మారిందన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో ఐదు కులాల నాయకత్వం ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల బిసి సెల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్, కాలా జయరాజు, ఎఎంసి ఉపాధ్యక్షుడు కేతా రాంబాబు, టిడిపి బిసి నాయకులు అనుసూరి శివప్రసాద్, దొంగ భాస్కరరావు, దొంగ సుధాకర్, టేకుమూడి వీరవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

ఫైలేరియాను అరికట్టేలా చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు, మామిడికుదురు

బాల్య దశలోనే ఫైలేరియాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం మండలంలోని మూలస్థాన అగ్రహారం ప్రభుత్వ పాఠశాల, మడికి రవీంద్ర పాఠశాలలో ఫైలేరియాపై సర్వేను నిర్వహించారు. చొప్పెల్ల పిహెచ్‌సి వైద్య అధికారి ఎన్.లక్ష్మీస్నేహతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థులకు రక్త నమూనాలు తీసుకొని పరీక్షలు నిర్వహించారు. ఇంటి నివాసాలలో, పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులు పరిశుభ్రంగా ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నమూనాలలో వచ్చిన రిపోర్టుల ఆధారంగా ఎవరికైనా ఫైలేరియా గుణం ఉన్నట్లుగా నిర్ధారణ అయితే వైద్య సేవలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి



మామిడికుదురులో పరీక్షిస్తున్న వైద్య బృందం

సిహెచ్.వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ పి.శివ ప్రసాద్, విహెచ్‌వి. సత్యనారాయణ, ఎల్‌టి మౌనిక, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు. అలాగే మామిడికుదురు మండలం అప్పనపల్లి మోడల్ స్కూల్లో సోమవారం 1, 2 తరగతుల విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామూల్ ప్రణయ్, స్కూల్ హెచ్ఎం నైనాల రఘురామయ్య, ఎంపిహెచ్ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ బల్ల నరసింహారావు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, ఎంపిహెచ్ఇఒ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీని నిలిపివేయాలని వినతి

ప్రజాశక్తి - అంబాజీపేట, అయినవిల్లి

జిల్లా పేరును తప్పుగా ముద్రించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని నిలిపివేయాలని మాల మహానాడు అధ్యక్షులు నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ స్మార్ట్ కార్డులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అని ముద్రించిన తరువాతే కార్డులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆధార్ కార్డుల్లోనూ జిల్లా పేరు మార్పు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్‌తోపాటు,



వినతిపత్రం ఇస్తున్న గిడ్డి వెంకటేశ్వరరావు



అంబాజీపేటలో వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

ఎంఎల్‌ఎ, ఆర్‌డిఒలకు వినతిపత్రాలను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు. అలాగే అయినవిల్లి మండలానికి చెందిన దళిత సంఘాల జెఎసి నాయకులు కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని నిలుపుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మాలమహానాడు అధ్యక్షుడు గిడ్డ వెంకటేశ్వరరావు, కుసుమ బహుగుణ, సరెళ్ళ సత్యనారాయణ, సరెళ్ళ నాగపండు, ఎం.టింకు, డి.మధు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. సోమవారం జరిగిన ఈ ధర్నాలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకర రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేతకాని తనం వల్ల యూరియా కొరత ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ లింకుతో రైతుకు ఒక బస్తా మాత్రమే సరఫరా చేయడం దారుణమన్నారు. దీంతో రైతులు ప్రయివేటు దుకాణాల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. యూరియా కొరత లేకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ అల్లూరి మధురాజు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కన్వీనర్ దేసినీడి ఉదయభాస్కరరావు,



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కోఆర్డినేటర్ మీసాల బాబీ, ఎఐసిసి సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు నీటిపూడి బాల సత్యనారాయణ, మూలపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SPECIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (MOBILE) cum 3RD ADDL. JUNIOR CIVIL JUDGE COURT : ELURU

I.A. 61/2023 in O.S. 356/2021

Between:
NELAPATI ADINARAYANA ...Plaintiff
and
D2 : THIRRI SRI PRIYA,
D/o. Parvathi (Late), Hindu, Age 34 Years, House Wife, R/o. F.B.O.Wild Range Forest Office, Forest Range Office Back Side, S.P.Office, Madhura Nagar, Kakinada, Kakinada District, A.P. ...Defendant No.2

పై నెంబరు I.A.No. 61/2023 in O.S. 356/2021 శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్ని వర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టువారు మీకు ఈ I.A. నోటీసులు పేపరు ప్రకటన ద్వారా అమలు పరుచుటకు ఆర్డరు వేసియున్నారు. కావున మీరు శ్రీ కోర్టువారి ఎదుట **ది. 22-09-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు గానీ, మీ తరపున ప్లీడరు గారి ద్వారా గానీ స్వయముగా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియచేయగలరు. లేని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానం చేయగలరు.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

ఏలూరు
ది.15-09-2025
CH. శ్రీనివాసరావు
అడ్వకేట్, ఏలూరు



నివాళులు అర్పిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

సిఆర్‌కి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక లిటిల్ ఫ్లాక్ లూథరన్ దేవాలయం ఛైర్మన్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు కప్పల వరప్రసాద్(సిఆర్)కు కన్నీటి వీడ్కోలు పలికారు. శనివారం వరప్రసాద్ మృతి చెందారు. బంధువులు, సన్నిహితులు, స్నేహితులు సందర్శనార్థం ఆయన పార్థీవదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.



వినతులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ సీతారామమూర్తి

పిజిఆర్‌ఎస్‌లో 152 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ భవనంలో ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిజిఆర్‌ఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.భాగ్యలక్ష్మి, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, ఎ.స్లీవారెడ్డి, లేబర్ సహాయ కమిషనర్ వలీ, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులను సత్కరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

అభ్యుదయ రైతులకు సత్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సోమవారం జరిగిన పిజిఆర్‌ఎస్‌లో అభ్యుదయ రైతులను జిల్లా అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ గత రెండు సీజన్లలో రాజమహేంద్రవరం రూరల్ మండలం, సీతానగరం మండలానికి చెందిన అభ్యుదయ రైతులు నానో ఎరువుల వినియోగం ద్వారా మంచి ఫలితాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రేడు మండలానికి చెందిన అభ్యుదయ రైతులు సుంకవల్లి చౌదరి, ఎన్.వి.వి. శ్రీనివాస్, చిన్నకొండేపూడి గ్రామానికి చెందిన జి.నాగరాజు, కె.సతీష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, మత్స్య డిడి టి.నిర్మల కుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అనుబంధ అధికారులు, ఇఫ్కో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎసి శ్రీనివాసరావు

రూ. 10 లక్షలు దాటితే వృత్తి పన్ను కట్టాలి

ప్రజాశక్తి - రాజానగరం

వార్షిక ఆదాయం రూ.10 లక్షలు దాటిన వారంతా వృత్తి పన్ను ఏడాదికి రూ.1,250 చెల్లించాలని సేల్స్ ట్యాక్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎవి.శ్రీనివాసరావు అన్నారు. ఇది ఆ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఉపయోగిస్తారని చెప్పారు. రాజానగరంలో సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం ఆవరణలో వృత్తి పన్నుపై స్థానిక వర్తక వ్యాపారులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. అమ్మకం, ఆదాయంపై ప్రభుత్వం జిఎస్‌టిల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ ఎ.సురేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంకటాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లంక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్‌కు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పిజిఆర్‌ఎస్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల అర్జీలను గడువులోగా సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి 21 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూకి సంబంధించి ఒకటి, టౌన్ ప్లానింగ్‌కు 5, ఇంజినీరింగ్ శాఖకు 10, వార్డు సచివాలయాలకు 3, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి 1, మెప్మాకు సంబంధించి ఒకటి ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఒ వినూత్న, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సిహెచ్.శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న గ్రామస్తులు

అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి - పెరవలి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న మండలం తీపర్రు నెంబర్-1 పాఠశాల ఉపాధ్యాయుడు కె.శ్రీనివాస్, నెం-2 పాఠశాల ఉపాధ్యాయుడు పి.రవికుమార్‌లను సోమవారం ఘనంగా సన్మానించారు. అవార్డులు పొండడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు అనంతరం ఇరువురిని దుస్సాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో నారాయణరావు, ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

అంబాజీపేట ఎంపిడిఒగా మమత

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట ఎంపిడిఒగా బి.మమత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వర రావు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఇఒపిఆర్‌డిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజల



ఎంపిడిఒను సత్కరిస్తున్న ఎంపిపి, తదితరులు

సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి ఎపిఎల్.నరసింహం, డిప్యూటీ ఎంపిడిఓ కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సిసి కెమెరాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తపేట

వ్యాపార సంస్థల వద్ద తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డిఎస్‌పి సుంకర మురళీమోహన్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ వ్యాపార సముదాయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కొత్తపేటలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వ్యాపారాలను



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

నిర్వహించుకోవాలని అన్నారు. అనుమతి లేకుండా బాణా సంచా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ జి.సురేంద్ర, వర్తక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్థాయిని మరచి విమర్శలు సరికాదు

ప్రజాశక్తి - అమలాపురం

మంత్రి సుభాష్‌ను విమర్శించే స్థాయి వైసిపి నాయకులకు లేదని శెట్టిబలిజ నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, విత్తనాల జయబార్గవ్ అన్నారు. సోమవారం స్థానిక కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోనసీమలో జరిగిన అల్లర్ల సమయంలో శెట్టిబలిజలను ఇబ్బందులకు గురి చేసినప్పుడు ఈ నాయకులంతా ఏమయ్యారని ప్రశ్నించారు. వైసిపి టికెట్ ఇవ్వకుండా కులాన్ని బొచ్చుతో సమానంగా చూశారని గుర్తుంచుకోవాలన్నారు. శెట్టిబలిజలకు అండగా



మీడియాతో మాట్లాడుతున్న శెట్టిబలిజ నాయకులు

నిలిచిన మంత్రి సుభాష్‌ను విమర్శించే స్థాయి లేదని గుర్తుంచుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో శెట్టిబలిజ నాయకులు వరసాల శ్రీనివాస్, మట్టపర్తి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు, కొవ్వూరు

O.S. No. 35/2025

Between:
Kakarala Akka Lakshmi ...*Plaintiff*
AND
Kakarala Udaya Lakshmi ...*Defendant*

To:
Kakarala Udaya Lakshmi, W/o. (late) Kakarala Srinivas, Hindu, aged 55, Resident of D.No. 3-38, Nidadavolu Road, Devarapalli Mandal, Verrnagudem, W.G.Dist.,

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 22-9-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొవ్వూరు
14-9-2025
యిన్నమూరి బాలసుబ్రహ్మణ్యం
అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, రాజమహేంద్రవరం

ఓ.యస్. నెం. 237/2025

బిట్వీన్:
సత్తి సత్యనారాయణరెడ్డి -వాది
మరియు
గీసాల శ్రీను మరియు వగైరాలు -ప్రతివాదులు

1వ ప్రతివాది: గీసాల శ్రీను, తండ్రి: అప్పారావు, డో.నెం. 3-31, నందరాడ గ్రామం, రాజానగరం మండలం, తూ॥గో॥జిల్లా.

2వ ప్రతివాది: శ్రీమతి పిల్లి ముని, భర్త: నాగేశ్వరరావు, డో.నెం. 3-61, నందరాడ గ్రామం, రాజానగరం మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలోని 1, 2 ప్రతివాదులకు కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఎన్నిసార్లు కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారాను పంపిననూ సదరు సమన్లు పుచ్చుకోకుండా కాలయాపన చేస్తున్న కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషను ద్వారా సమన్లు పంపమని ఉత్తర్వు వేసినందున సదరు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సదరు 1, 2 ప్రతివాదులు ది. **06-10-2025వ** తేదీన **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.
//కోర్టు వారి అనుమతితో//

పి.వి.వి.యస్.బి.రాజు
జి.సత్యనారాయణ
రాజమహేంద్రవరం
తేది:12-9-25 అడ్వకేట్స్, రాజమండ్రి